రైతుకు ఖేదం.. వ్యాపారులకు మోదం..!



- భారీగా పతనమైన కూరగాయల ధరలు
- రైతుకు–రీటైల్ వ్యాపారికి కిలోకి రూ.5పైగా వ్యత్యాసం
- పండించిన రైతుకు నష్టం.. వ్యాపారికి లాభం
- పెట్టుబడి సైతం దక్కక లబోదిబోమంటున్న రైతులు



వారపు సంతలో కూరగాయల దుకాణం, (ఇన్‌సెట్) అమాంతం తగ్గిన కూరగాయల ధరలు

పలమనేరు: పంటల సాగుకు లక్షలు వ్యయం చేసిన రైతులకు ధరలేక కనీసం పంట పెట్టుబడి కూడా దక్కలేదు. గత మూడునెలల నుంచి అన్ని రకాల కూరగాయలకు ఆశించిన ధరలు లేవు. దీంతో రైతు మార్కెట్‌లో వ్యాపారులు అడిగినంత ధరకు తమ వ్యవసాయోత్పత్తులను ఇవ్వాల్సి వస్తోంది. సరుకు కొన్న మండీ నిర్వాహకులు కమీషన్ రూపేణా ఆదాయం వస్తోంది. మండీల నుంచి కూరగాయల కొనుగోలు చేసి రిటైల్ మార్కెట్‌కు వచ్చేసరికి కిలోపై రూ.5 నుంచి రూ.10 వరకూ వ్యత్యాసం ఉంటోంది. ఫలితంగా ఆరుగాలం కష్టపడి పండించిన రైతుకు నష్టం చవిచూస్తుండగా, అప్పటికప్పుడు సరుకుకొని అమ్మేవారికి నికర ఆదాయం పొందుతున్నారు. దీంతో రైతుల్లో నిర్వేదం ఆవరించింది.

భారీగా తగ్గిన కూరగాయల ధరలు

గత మూడు నెలల నుంచి అన్ని రకాల కూరగాయలకు ధరలు తగ్గుముఖం పట్టాయి. కోవిడ్ తర్వాత కురిసిన వర్షాలతో భూగర్భ జలాలు పెరగడంతో పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో కూరగాయల సాగు కూడా పెరిగింది. ఇదే సమయంలో బయటి రాష్ట్రాల్లోనూ కూరగాయలు అందుబాటులో ఉండడంతో తగినంత డిమాండ్ లేకుండా పోయింది. ఫలితంగా ధరలు పడిపోయాయి.

ఎక్కడికి వెళ్లినా..!

మామూలుగా పల్లెటూరి ప్రజలు తమ సమీప ప్రాంతాల్లో నిర్వహించే వారపు సంతలో కూరగాయలు కొనుగోలు చేయడం అనాదిగా చూస్తున్నాం. సంతలోగానీ రైతుబజార్లలో అయితే మార్కెట్ కంటే తక్కువ ధరలకే పొందవచ్చని జనం సంతలకు వెళ్లడం పరిపాటి. అయితే సంతల్లోని వ్యాపారులు సైతం ఒక్కటై ఏ దుకాణానికి వెళ్లినా ఒకే ధర ఉండేలా అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో ఎక్కడెళ్లినా వారు చెప్పిన ధరకు కొనుగోలు చేయాల్సిన వస్తోంది.

పలమనేరులో కూరగాయల ధరలిలా....

కూరగాయల	ధర	పచ్చిమిర్చి	రూ.30
టమాట(కిలో)	రూ. 10	తెల్లగడ్డలు	రూ.90
బీన్స్	రూ. 60	బంగాళదుంప	రూ.15
ఎరగడ్డలు (ఉల్లి)	రూ.20	క్యాబేజ	రూ.15
మునక్కాయలు	రూ.50	బీర	రూ.17
క్యారెట్	రూ.15	ఆకుకూరలు కట్ట	రూ.20
వంకాయ	రూ.15	పుదీనా	రూ.20
బెండ	రూ.10	కొతిమీర	రూ.10
కంద	రూ.40	క్యాప్సికం	రూ.40

ఆదుకునే దిక్కే లేదు



గత ఆరునెలలుగా ఏ కూరగాయలకు సరైలు ధరలు లేవు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. ముఖ్యంగా టమాట పంటకు ఎకరా సాగుకు రూ.లక్ష దాకా ఖర్చు పెట్టి రూ.20 వేలు కూడా దక్కలేదు. ధరలు ఇంతలా పతనమైతే రైతులు ఎట్లా బాగుపడతారు? ఆదుకునే దిక్కే లేదు. –క్రిష్టారెడ్డి, రైతు, పెద్దవెలగటూరు, పెద్దపంజాణి మండలం

రైతుకు నష్టం..వ్యాపారులకు లాభం



ఏదైనా కూరగాయలు పండించి మార్కెట్‌కు తీసుకెళితే అక్కడ కొనేది చాలా తక్కువ. అదే కూరగాయలకు రీటైల్ షాపులో కొందామంటే కిలోకు రూ.5 నుంచి రూ.10 దాకా తేడా ఉంటోంది. వ్యాపారి కొన్న సరుకు పెట్టుబడికి నికర ఆదాయం పొందుతుంటే, పంటలు సాగు చేసిన రైతుకేమో నష్టాలేనా? –దేవేంద్రరెడ్డి, రైతు, మొరం, పలమనేరు మండలం

భక్తులతో బోయకొండ కిటకిట

- ప్రత్యేక అలంకారంలో అమ్మవారు
- రద్దీగా క్యూలు



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ''కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మ తల్లీ..బోయకొండ గంగమ్మా!.. మేమంతా సుఖ శాంతులతో ఉండాలని ఆశీర్వదించమ్మా..!'' అంటూ పూజలు చేశారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వేసవి సెలవుల్లో చివరి ఆదివారం కావడంతో విద్యార్థులు, యువకులు, ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో వచ్చారు. పలు గ్రామాల ప్రజలు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయంలో రద్దీతో క్యూలన్నీ కిక్కిరిసాయి. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. పోలీసులు ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

చంద్రప్రభపై గోవిందుడి వైభవం



చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న గోవిందరాజస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన ఆదివారం రాత్రి చంద్రప్రభ వాహనంపై వెన్నకృష్ణుడి అలంకరణలో కొలువై ఊరేగుతూ శ్రీగోవిందరాజస్వామి భక్తులను కనువిందు చేశారు. మంగళవాయిద్యాలు, భక్తజన బృందాల కోలాటాలు, భజనల మధ్య స్వామివారి చంద్రప్రభ వాహన సేవ కోలాహలంగా సాగింది. దీనికి ముందు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారు సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించి విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఎఫ్ఏఅండ్‌సీఏఓ బాలాజీ, డెప్యూటీ ఈఓ వీఆర్ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, పలువురు శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం స్వామివారి రథోత్సవం వైభవంగా జరుగనుంది. ఉదయం 6.15 గంటల నుంచి రథంపై స్వామివారు కొలువై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తారు. అలాగే రాత్రి 7 గంటలకు అశ్వ వాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు.

కంటి ఆపరేషన్లకు 63 మంది ఎంపిక



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణులు

సదుం: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆదివారం మానవత సంస్థ(పీలేరు), శ్రీవెంకటేశ్వర అరవింద్ ఐ హాస్పిటల్ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించాయి. శిబిరంలో 150 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి 63 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు చెప్పారు. సంస్థ చైర్మన్ రామచంద్ర, డాక్టర్లు స్ఫూర్తి, సింధు, గౌరీశంకర్ కుమార్, హెచ్ఎం జయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో 33 మంది..



బైరెడ్డిపల్లె: కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం చెన్నై శంకరనేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 33 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఉచిత ప్రయాణంతో పాటు భోజన వసతి కల్పిస్తామని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మురళి, కృష్ణ, శ్రీనివాసులు, రమణ, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

అలరించిన బలి బండి కుంభాలు

వెదురుకుప్పం: మండలంలో పచ్చికాపల్లంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహా భారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బలి బండి కుంభాల కార్యక్రమం నిర్వహించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథా కాలక్షేపం అనంతరం సాయంత్రం బకాసురుని వేషధారి బలికూడుతో అమ్మవారి ఆలయ ప్రదక్షిణ చేసి ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మంగళంపేటలో కలిసిన పూర్వ విద్యార్థులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మంగళంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఇక్కడ 1993–94లో పదవ తరగతి చదివిన వారు కాలక్రమంలో ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఆదివారం ఇక్కడ కలిసి జ్ఞాపకాల పేజీలు తిరగేశారు. బాల్య స్మృతులు గుర్తుకు తెచ్చుకుంటూ సందడి చేశారు. తమ భవితకు బాటలు వేసిన గురువులను సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. స్కూలు అభివృద్ధికి తమ వంతు సాయం చేస్తామన్నారు. అభివృద్ధికి తమవంతు సాయం అందిస్తామన్నారు.

షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సైదూసాబ్ షైనింగ్ స్టార్ పురస్కారానికి ఎంపికయ్యాడని హెచ్ఎం జయకుమార్ రెడ్డి ఆదివారం తెలిపారు. పదవ తరగతి పరీక్షలలో 562 మార్కులు పొందడంతో అతడిని ఈ పురస్కారానికి ఎంపిక చేశారని, సోమవారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేస్తారని చెప్పారు. ఆ విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

గుడుపల్లె నుంచి మరో ఐదుగురు..

గుడుపల్లె: పదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులకు ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎస్.స్వప్న, ఏపీ మోడల్ స్కూల్లో గీతాంజలి, కేజీబీవీ స్కూల్లో వినీల, కొడతనపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని శిరీష, సోడిగానిపల్లె జెడ్పీ హైస్కూల్ నుంచి కావ్య ఎంపికయ్యారని తెలియజేశారు. వీరికి త్వరలో వీరికి పురస్కారాలు ప్రదానం చేస్తారన్నారు.

రొంపిచెర్లలో ఐదుగురికి..



రిషిత, భరత్‌కుమార్

రొంపిచెర్ల: పదవ తరగతి, ఇంటర్ మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు షైనింగ్ అవార్డులకు ఎంపికయ్యారని ఎంఈఓ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్‌లో 500 మార్కులు పైచిలుకు సాధించిన వారిని ఈ పురస్కారాలకు ఎంపిక చేశారని, వీరికి ప్రభుత్వం రూ.20 వేలు, మెడల్, ప్రశంసా పత్రం అందజేస్తుందని తెలియజేశారు. ఆదర్శ పాఠశాల నుంచి భరత్ కుమార్ నాయుడు, వీణావాణి, రిషిత, బాలికల ఉన్నత పాఠశాల నుంచి జోయో, కస్తూర్బా గురుకుల పాఠశాల నుంచి లలిత ఎంపిక అయ్యారని తెలిపారు. వీరికి సోమవారం చిత్తూరులో అవార్డులను ప్రదానం చేస్తారని తెలిపారు.

వైభవంగా వాహన సేవలు

వడమాలపేట (విజయపురం): అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారు ఆదివారం చిన్నశేష, హంస వాహనాలపై విహరించారు. అప్పలాయగుంట గ్రామంలో వృద్ధుడు మృతి చెందడంతో ఆదివారం ఉదయం ఆలయాన్ని తెరవలేదు. దహన క్రియలు పూర్తయిన తరువాత ఆలయాన్ని శుద్ధి చేసి, ఆలయాన్ని గ్రామాన్ని సంప్రోక్షణ చేసి సాయంత్రం 5గంటలకు చిన్నశేష వాహనంపై శ్రీవారిని మాడ వీధులలో కాకుండా ఆలయం చుట్టూ ఊరేగించారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు భక్తి కీర్తనల ఆలాపనల నడుమ ఊంజల్ సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు వాహన మండపానికి చేరుకున్న శ్రీవారు అలంకరించిన హంస వాహనం అధిరోహించి పుర వీధులలో విహరించారు. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులు, నారికేళాలు సమర్పిస్తూ భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, అలయాధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారచార్యులు, కంకణభట్టార్ తిప్పయాచార్యులు, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పం విద్యాశాఖ ఖాళీ..!

ఉపాధ్యాయుల బదిలీలతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో పలు పోస్టులు ఖాళీ కానున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో 650 వరకూ ఖాళీ పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల బదలీల ప్రక్రియ కౌన్సెలింగ్ నిర్వహిస్తోంది. దరఖాస్తు చేసుకున్న ప్రకారం టీచర్ల బదిలీలు పూర్తి చేస్తే కుప్పం నియోజకవర్గం నుంచి స్వస్థలాలకు వెళ్లేందుకు పలువురు మొగ్గు చూపుతున్నారు.

- బదిలీలతో స్వస్థలాలకు వెళ్లేందుకు మొగ్గు చూపుతున్న టీచర్లు
- 1,220 మంది బదిలీలకు దరఖాస్తు
- భర్తీ కావాల్సిన టీచర్ పోస్టులే 650 వరకూ ఖాళీ!



కుప్పం మండలం పరిషత్ కార్యాలయం

కుప్పం: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 434 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1,670 మంది టీచర్లు ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్నారు. వీరిలో బదిలీలకు 1,220 మంది దరఖాస్తు చేశారు. కుప్పం మండలంలో 565 మంది, శాంతిపురం మండలంలో 283, గుడుపల్లె 176, రామకుప్పం 184 మంది చొప్పున వీరిలో ఉన్నారు. వీరంతా బదిలీలైన పక్షంలో టీచర్ల కొరత ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉంటోంది.

50 శాతం బదిలీలు

దరఖాస్తు చేసుకున్న వారిలో 50 శాతం వరకు బదిలీ చేయనున్నటుధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రైమరీ, ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్న చోట రిలీవర్ వచ్చేంత వరకు ఒకరిని బదిలీ చేసి, మరొకరిని అక్కడే ఉంచుతారు. డీఎస్సీ పూర్తయిన తరువాత కొత్తగా వచ్చే పూర్తి స్థాయిలో జాయిన్ అయితే బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయనున్నట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నాలుగు మండలాల్లో ఇప్పటికే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు 650 మేరకు భర్తీ చేయాల్సి ఉంది.. ఇప్పుడు చేసిన బదిలీలు, డీఎస్సీ నిర్వహించి, నూతన ఉపాధ్యాయుల పోస్టింగ్‌లతో కుప్పం నియోజకవర్గంలో టీచర్ల కొరత తీరుతుందా? అనేది వేచిచూడాల్సి ఉంది.

క్లుప్తంగా

వైభవంగా ముత్యాలమ్మ జాతర



సారె తీసుకువెళ్తున్న గ్రామస్తులు

రొంపిచెర్ల: మండలంలోని పాతకురవపల్లెలో ముత్యాలమ్మ జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి గ్రామస్తులు సారెను బ్యాండు మేళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. అనంతరం గ్రామంలోని ముత్యాలమ్మ, గంగమ్మ, ఈరాబాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు ఈ పర్యాయం ఘనంగా ఉత్సవాలు నిర్వహించినట్టు నిర్వాహకులు చెప్పారు. కోటా కుటుంబం ముందుండి ఈ కార్యక్రమాలను విజయవంతం చేసింది.

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ



ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులు

పలమనేరు: ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంప్రూవ్‌మెంట్ పరీక్షల్లో పట్టణానికి చెందిన మధు, శ్రీవాణి కళాశాలల విద్యార్థినులు ప్రతిభను చాటినట్టు కళాశాల నిర్వాహకులు క్రిష్ణమూర్తి రెడ్డి ఆదివారం తెలిపారు. ఎంపీసీలో సానియా 465/470, బైపీసీలో సమీరా 434/440, సీఈసీలో ప్రీతి 490/500, ఎంఈసీలో కవిత 486/500 టాపర్లుగా నిలిచారని తెలిపారు. మొత్తం మీద కళాశాలల్లో 107మంది 400 పైగా మార్కులు సాధించారని తెలిపారు. వారిని యాజమాన్యం అభినందించింది.

ఘనంగా జన్మదిన వేడుకలు



బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడతోపాటు పలు ప్రాంతాల నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని వెంకటేగౌడ ఆయనకు సూచించారు.

నెల్లిపట్లలో ఘనంగా గంగజాతర



గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

బైరెడ్డిపల్లె: మండలంలోని నెల్లిపట్లలో శనివారం రాత్రి వైభవంగా గంగజాతర నిర్వహించారు. శనివారం రాత్రి గ్రామ పొలిమేరల్లో అమ్మవారి శిరస్సుకు ప్రత్యేక పూజలు చేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం ఆలయం వద్ద ప్రతిష్ఠించి భక్తులకు దర్శనమిచ్చారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

తెప్పపై సుందరరాజస్వామి విహారం



చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన ఆదివారం సాయంత్రం పుష్కరిణిలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీసుందరరాజ స్వామి తెప్పపై విహరిస్తూ భక్తులకు దివ్యానుగ్రహం ప్రసాదించారు. మధ్యాహ్నం 3గంటలకు ఉభయదేవేరులతో కలిసి స్వామివారిని సన్నిధి ముఖమండపానికి తీసుకొచ్చారు. అనంతరం వేదపారాయణం, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు సర్వాంగ శోభితుడైన స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతంగా తెప్పపై కొలువై మూడు పర్యాయాలు పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం స్వామివారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమాల్లో ఆలయ డెప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈఎస్ఓ సతీష్, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్లు రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెప్పోత్సవాల్లో నేడు..

తెప్పోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు పుష్కరిణి మధ్యలో ఉన్న నీరాడ మండపంలో శ్రీపద్మావతి అమ్మవారికి అభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు తెప్పోత్సవం, రాత్రి 7.30 గంటలకు తిరుచ్చి ఉత్సవం జరుగుతుంది.

నోటీస్ బోర్డు

నేడు యోగాంధ్ర ర్యాలీ

గంగవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 8 గంటలకు యోగాంధ్రపై నిర్వహించనున్న అవగాహన ర్యాలీలో మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు, యువత, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సురేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

గంగవరంలో..

సదుం: యోగాంధ్రపై సోమవారం ఉదయం 9.30 గంటలకు స్థానిక బస్టాండ్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హరిబాబు తెలిపారు. ర్యాలీలో విద్యార్థులు, ప్రజలు, వివిధ శాఖల ఉద్యోగులు, పీడీలు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొనాలని ఆయన కోరారు.

భగవద్గీత పఠనంతోనే విశ్వశాంతి



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

కుప్పం రూరల్: భగవద్గీత పఠనంతోనే విశ్వశాంతి సాధ్యమని ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ పేర్కొన్నారు. ప్రబోధానంద రచించిన పుస్తకాలపై ఆదివారం రామకుప్పం మండలం అయిప్పగానిపల్లెలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పుస్తకాలు ఉచితంగా ఇచ్చారు. కృష్ణ మాట్లాడుతూ, భగవద్గీతలో లేని నీతి లేదని, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా భగవద్గీత పారాయణం చేయవచ్చన్నారు. భగవద్గీత పఠనంతో జ్ఞానం కూడా కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రబోధానంద సేవాసమితి సభ్యులు దేవరాజు, శరవణ, కృష్ణమూర్తి, శివకృష్ణ, రితీష్‌కుమార్, శివకృష్ణ, రాకేష్, లోకేష్, చరణ్ , దిలీప్, వెంకటలక్ష్మీ, జలజాక్షి, వాణి, కల్యాణి పాల్గొన్నారు.